# స్పూత్నిక్కుల మిష్టరీ

"భద్రం !"

"గురో ?"

"ఇందాకణ్ణించీ హాకాశానికేసి చూస్తున్నా, భద్రం."

"నే చూస్తూనే ఉన్నా గురో."

"హాకాశం కేసే ?"

"లేదు, గురో మీరు చూస్తున్నకేసి."

"ఓ, అదా—ఒక్కటీ కనపళ్ళా భద్రం, ఎందుకంటావ్ ?"

"ఏంటి కనపళ్ళా గురో ?"

"వాట్టి మొద్దు తలకాయి. డిటెక్టివ్ హసిస్టెంటు అందిస్తే హల్లుకు పోవద్దూ !"

"అవే, భద్రం—వాటిపేరు నోరు తిరగదు—స్పూత్నికుక్కలు ! అవును, స్పూత్నికుక్కలు. ఒక్క స్పూత్నికుక్కలూ కనిపించవేం ?"

"పగటేళ అంత ఏమంతగా కనిపించవు, గురో. రాత్రిరేళ బైనాకిల్సేసి చూస్తే కనిపించొచ్చునేమో !"

"చూశు, భద్రం. ఈ స్పూత్నికుక్కలు ఎందుకో నీకేమన్నా తెలిసిందీ ?"

"వట్టి యాలమెర్రి. గురో. షుసక దండగ."

"హంతేనా నీకు తెలిసిందీ ?" నాకు నవ్వొచ్చింది వాడి తెలివి తక్కువకి.

"ఒక అంతకుడున్నాడనుకో."

"అబ్బెంతరవేడి, గురో ?"

"వాడు ఎవత్తెనన్నా మొండిమొల దాని గొంతులో బాకుపొడిచి, ఎవరికీ అందకుండా ఒక స్పూత్నికుక్కలో ఎక్కి హుడాయించాడనుకో."

"అబ్బా. పెద్దప్లాటే యేశారే !"

"విను మరీ . . .స్పూత్నికుక్కలో ఎగిరిపోయిన అంతకుణ్ణి నువ్వెట్టాపడతావ్ ? నీ క్లూలన్నీ ఎందుకూ ?"

"యాడవను !"

"అసలువాడు స్పూత్నికుక్క ఎక్కిపోయినాడనే నీ డిటెక్షనకు తెలిసేదెట్టా !"

"పోలీసు కుక్కల్ని వొదిలితేనో, గురో ?"

"కుక్కలా !... కొంచెం ఉండు ! ప్లాటు మార్చాలి. . .అన్నట్టు స్పూత్నికుక్కలలో

కుక్కలుకూడా పోతైట, నిజమేనా ?"

"ఎందుకు పోగూడదు, గురో? కార్లల్లో యెళ్ళటంలా ? మొన్న సాయంకాల మనం కోడంబాకం గేటునానుకొని ఉండగా ఒక చివర్లెట్టు కారులో ఆ బొచ్చుకుక్క—"

"భద్రం !"

"గురో ?"

"నా ప్లాటంతా పాడుచేస్తున్నావు !"

"రెండు కులూలు నా మొహానపారేస్తే నేనుకూడా సంతోషిస్తాగా గురో !"

"అయితే విను. అంతకుడు అమ్మాయిని గొంతులో కత్తి దిగెయ్యటం చెప్పానుగా?"

"చెప్పారు, గురో. మొండిమొల ఆడకూతురు."

"అది అట్టమీది బొమ్మకోసంలే. బట్టలేసుకుంటే మాత్రం గొంతులో కత్తి దిగెయ్యటానికేం ?"

"అభ్యంతరమేటి, గురో ?"

"ఆతరవాత అంతకుడు డాబామీదికిపోయి హెక్కణ్ణించి స్పుత్నిక్కులో హాకాశంలోకి దూసుకుపోలాడనుకుందాం."

"డాబామీది స్పుత్నికు లడీగా ఉంటాదన్నమాట !"

"అంతకుడు ఆమాత్రం జాగ్రత్తపడ్డా? తరవాత నీ డిటెక్టివ్ వస్తాడు. క్లూలన్నీ భద్రంగా జేబురుమాలులో ఎత్తుకుని దాచుకుంటాడు. భూతద్దం వేసుకుని క్లూల వెంబడి డాబామీదికి పోతాడు. పోతే ఏముందీ; హత్యాశ్చర్యం, ఇంక క్లూలులేవు! పోలీసు కుక్కల్ని అప్పుడు తీసుకురా! డాబామీదికి వచ్చిన కుక్కలు గాలిలోకి దూకుతై. హెటూపోవు! "ఇందులో ఏదో స్పుత్నిక్కు ఉందిలే. భద్రం! అంటారు."

"హ తెరీ ! నా సామిరంగా ! గోడమీద కొరాయ్, నేతిమిఠాయ్ !"

"ప్లాటు తెలుస్తున్నదా, భద్రం ?"

"యిన్నంత వరకు మోతగా వుంది. గురో !"

"ఇప్పుడు కేయాస్ అంతకుణ్ణి పట్టటమెట్లా?

"తల్కిందమొయ్యా. ఇంకో స్పుత్నిక్కేసుకుని యెంటబడి తరవటమేగా ?"

"భద్రం !"

"గురో !"

"ఏంటో అనుకున్నాగాని, నీది హద్భుతమైన బుర్రే !"

"అవిడియాలు అప్పుడప్పుడూ తట్టుతాయి, గురో !" అన్నాడు భద్రం సీమంతం పెళ్ళికూతురల్లే సిగ్గుపడుతూ.

"అదీ మంచిదే, భద్రం. ప్లాటు విన్నాక బుక్కు నువే రాద్దుగాని. నీకు హక్షరాలు బాగా కుదురుతై లే. నా దస్తూరి ఏమంత ఇదిగా ఉండదు".

"హా తెరి ! రమణమహాఋషీ ! బగవానుడా ! నే రాయటమే ? ఏదీ పార్కరుకలం ?"

"కొంచెం ఆగూ! ప్లాటు పూర్తికానీ!"

"ప్లాటు పూర్తయేదాకా ప్రాణం ఆగుతుందా, గురో. రాసి పారేసినాక ప్లాటు చూసుకోవచ్చు. ఆర్టిస్టుకు ట్రంకెయ్యనా గురో! ప్రెస్సుక్కూడా అచేత్తోనే—"

"భద్రం!"

"గురో!"

"నువు తొందరపడుతున్నావు భద్రం. నువు డిటెక్టివలు రాయటానికి పనికిరావు! ప్లాటు వినకుండా రాస్తే నేను పుస్తకానికి పేరుపెట్టను?"

"అయితే ఆ మిగిలిన కులూ కూడా నా మొహానెయ్యండి గురో!"

"విను. అంతకుడు పోయినాక డిటెక్టివ్ బయలుదేరటానికి రెండు రోజులే పడుతుందో, వారం రోజులే పడుతుందోగద! అంతకుణ్ణి అందుకోవటం కష్టంగద! ఓ మాదిరి స్పూత్నిక్కు ఎంత విస్పీడుంటుందంటావు?"

భద్రం బుర్రగోక్కుని, "లేకేం, గురో? ఎంతలేదన్న శానా శానా స్పీడేమరీ? మన యెలికోప్టరు దానికింద బలాదూరేగా?" అన్నాడు.

"మన స్పూత్నిక్కు దానికి రెండింతలు విస్పీడుంటే ఎన్నాళ్ళకి అందుకోగలం?"

"వాడెంతముందు బయలెళ్ళాడూ?"

"వారం రోజు లనుకో!"

"వొద్దు, గురో! దణ్ణవెడతా, గురో. ఒక్కరోజు ముందెళ్ళ నివ్వండి. నా జోరు చూపిస్తా!"

"నీ జోరా, భద్రం?" అన్నాను హాశ్చర్యంతో.

"కాదూ. మరి? మన స్పుత్నీకు నేనేగా తోలేదీ. ఎహెహెహె హెయ్! ఛో, ఛో, ఛో! నీగిత్త బడిసావ! నిన్ను మాదిగాడు దిన!"

"ఓహో! తెలిసిందిలే! సరే ఒకరోజే వేసుకో. మనం అంతకుణ్ణి ఎంతసేపట్లో అందుకుంటాం!"

"ఒక రెళ్ళ రెండూ. రెంటిలో ఓటి పోతే ఓటి. మర్నాడు దీపాలు పెట్టేయేళకి అందుకుంటాం గురో!"

"భేష్, అట్లా అయితే—"

"ఉండండి గురో! పప్పులో కాలేశాం గురో!"

"పప్పులోనే? కాలే? ఎహెయ్యటమే? మిష్టరీ! మిష్టరీ!"

"మిష్టరీ ఏంలేదు గురో! స్పుత్నీకులో పోయిన నా కొడుకు గంటన్నరకోసారి బూయి చుట్టూ తిరుగుతూనే ఉంటాడుగా గురో!"

నా హత్యాశ్చర్యానికి మేరలేదు. "భద్రం, సరిగా ఆలోచించి మరీచెప్పు! నీమాట నమ్మి ప్లాటు బిగించేశానంటే తరవాత మన పుస్తకం హమ్మడవకపోతే పూచీ నీదీ!"

"ఓ, మా రాజుగా! కావలిస్తే నే జెప్పాననికూడా చెప్పండి. మీకింకా తెలీదు గామాలె. స్పుత్నీకు రోజుకు పదిహేడు, పద్దేందిసార్లు బూయిచుట్టూ చక్కరుకొడతాది. పద్ధెనిమి దొకట్లు పద్ధెనిమిదీ, మద్దెని పదరెం తొమ్మిదీ—రోజైపాయె!"

"అంటే మనం హాకాశంకేసి అహట్లా చూస్తూ ఉన్నామంటే మన దగ్గిరికి వాడే వస్తా డన్నమాట! హద్భుతంకాదు భద్రం? హద్భుతం! హత్యాశ్చర్యం!"

"హవు—అవునుగురో! మన స్పుత్నీకు గురెట్టి సూటిగా నడిపానంటే నిమిషమున్న రలో దొరికిపోతాడు నాకొడుకు!"

నాకు హావేశం వచ్చేసింది. "చూస్తావేం భద్రం? ఏదీ మన స్ఫూర్తిక్కా, తుడిచి రేడియేటర్లో నీళ్ళుపోసి హిక్కడున్నట్టు తీసుకురా!" అని అరిచాను.

"ప్లాటు గురో, ప్లాటు!"

"అవును భద్రం. హంతలోనే పుస్తకంలోకి వెళ్ళిపోయాను. ఇంక ప్లాటే ముందిలే భద్రం. స్ఫూర్తిక్కులు రెండూ ఒకదాని వెంబడి ఒకటి దొర్లుకుంటూ దూసుకుపోయినాక ఒకదాన్నొకటి ఢీకొనటమూ, అంతకుమూ నేనూ అంత ఎత్తున—ఎంత ఎత్తుంటుంది భద్రం?"

భద్రం బుర్రగోక్కుని, "లేకేం గురో, ఎంతలేదన్నా శానా ఎత్తుంటుంది, గురో. గాలికూడా ఉండదు. వొట్టి సూన్యం!" అన్నాడు.

"మరీ మంచిది. 'సూన్యంలో స్ఫూర్తిక్కువేట' అని పేరుపెట్టేదాం. మన ఆర్టిస్టును బొమ్మ బాగా వెయ్యమను ఒకటి రష్యావాడి స్ఫూర్తిక్కా, ఒకటి అమెరికా వాడిదీ వెయ్యమను."

"మరి మొండిమొల ఆడదో గురూ?"

"అది హనవసరం భద్రం. అన్నిటిమీదా ఆడాళ్ళుంటూనే ఉన్నారుగా. స్ఫూర్తిక్కులు నావిల్లోగా ఉంటుంది. ఏమంటావు?"

"కాపీలు మిగిలిపోవల్సిందేనా గురో?" అన్నాడు భద్రం దిగులుగా.

"అయితే ఒకమూల దాన్నికూడా హగోరించమను,"

"ప్లాటు ఇంతేనా గురో?"

"ప్రస్తుతానికి ఇహింతే! రాస్తూంటే ఏమన్నా కావలిస్తే నన్నడుగు"

"హా తెరీ! భగవానుడా! ఏడుకొండలవాడా! గోడమీద కొతాయ్! నేతి మిఠాయ్! ఏదీ నా పొక్కరు? ఏయీ కాయిదాలు? నా సామిరంగా! మీసాలదొంగా!..." అంటూ భద్రం నృత్యం చేశాడు.

నేను హాకాశంకేసి చూస్తున్నాను... ఆలోచిస్తున్నాను...

ముద్రణ: కొడవటిగంటి కుటుంబరావు కథల సంపుటి నుంచి, జయాపబ్లికేషన్స్, విజయవాడ